TELTEL/2023/87917

# జనంవెలుగు

www.janamvelugu.com, janamvelugu2023@gmail.com అనునిత్యం అక్షరసత్యం

సంచిక: 22 సంపుటి: 03 ఎడిటర్: సీతార్ల సురేష్ బుధవారం 9 ఏప్రిల్ 2025 పేజీలు: 8

విలేఖర్లు కావలెను

జనం వెలుగు న్యూస్ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలనుండి జిల్లా మరియు మండల విలేఖరులు కావలెను

ఆసక్తి కలవారు వెంటనే సంప్రదించండి

9603322119

## 400 ఎకరాలు కాదు అని దాని వెనుక వేల ఎకరాల భూకుంభ కోణం ఉంది

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కీలక వ్యాఖ్యలు

**జనంవెలుగు, హైదరాబాద్ ఏప్రిల్ 8:–** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో భారీ భూకుంభకోణాన్ని బయటపెడతానని హెచ్చరించారు. 400 ఎకరాలు కాదు అని దాని వెనుక వేల ఎకరాల భూకుంభ కోణం ఉందని ఆరోపణలు చేశారు. ఈ కుంభకోణంలో బిజెపి ఎంపి కూడా ఉన్నారని, రెండు జాతీయ పార్టీల జుట్టు ఢిల్లీ చేతిలో ఉందని ఎద్దేవా చేశారు.ఒకరు ఢిల్లీ నేతల చెప్పులు మోస్తే, మరొకరు ఢిల్లీకి బ్యాగులు మోస్తున్నారని కెటిఆర్ చురకలంటించారు. కాంగ్రెస్, బిజెపిలకు ఉమ్మడి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ధ్వజమెత్తారు. రేవంత్‌ని కాపాడుతోంది కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అని విమర్శలు గుప్పించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బాంబులు తుస్సుమన్నాయని కెటిఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బిజెపి ఇచ్చిన అచ్చే దిన్ వచ్చిందని, ఎన్‌డిఎ ప్రభుత్వం ఒకే రోజు హ్యాట్రిక్ సాధించిందని దుయ్యబట్టారు. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుతుంటే మోడీ ప్రభుత్వం మాత్రం ఎల్‌పిజి సిలిండర్ల ధరను రూ.50 పెంచడంతో పాటు పెట్రోల్, డీజిల్ కు అదనంగా



రెండు రూపాయల ఎక్సైజ్ సుంకాన్ని విధించిందని కెటిఆర్ ధ్వజమెత్తారు. స్టాక్ మార్కెట్ లో ఒక్క రోజులోనే 19 లక్షల కోట్ల సంపద ఆవిరైపోయిందని మండిపడ్డారు. ఇది అచ్చే దిన్ నుంచి హామీనా?, మేక్ ఇన్ ఇండియా నినాదామా ? అని మోడీ ప్రభుత్వంపై కెటిఆర్ విరుచుకపడ్డారు.

## దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసు దోషులు ఐదుగురికి ఉరిశిక్ష

### గతంలో ఎన్ఐఏ కోర్టు ఇచ్చిన తీర్పునే తెలంగాణ హైకోర్టు ఖరారు

**జనంవెలుగు, హైదరాబాద్ ఏప్రిల్ 8:–** దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసులో గతంలో ఎన్ఐఏ కోర్టు ఇచ్చిన తీర్పునే తెలంగాణ హైకోర్టు ఖరారు చేసింది. పేలుళ్ల కేసులో దోషులుగా ఉన్న ఆ ఐదుగురికి ఎన్ఐఏ కోర్టు విధించిన ఉరిశిక్షను సమర్ధించింది. బాంబు పేలుళ్ల కేసులో దోషులుగా తేలిన ఐదుగురికి ఎన్ఐఏ కోర్టు 2016లో ఉరిశిక్ష విధించింది. ఆ శిక్షను రద్దు చేయాలని కోరుతూ దోషులు తెలంగాణ హైకోర్టులో అప్పీల్ పిటిషన్ దాఖలు చేశారు.దోషుల అప్పీల్ పిటిషన్‌పై ఇప్పటికే విచారణ జరిపిన హైకోర్టు మంగళవారం తీర్పు చెప్పింది. దోషుల పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు తెలిపింది. కాగా దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. 2013 ఫిబ్రవరి 21న దిల్‌సుఖ్‌నగర్ బస్టాప్‌లో, మిర్చిపాయింట్ వద్ద జరిగిన జంట పేలుళ్లలో 18 మంది మరణించారు. 131 మంది గాయపడ్డారు. ఐదుగురు నిందితులకు ఎన్ఐఏ కోర్టు ఉరిశిక్ష విధిస్తూ 2016 డిసెంబర్ 13న తీర్పు చెప్పింది.ఐదుగురు ముద్దాయిలు ఈ తీర్పును రద్దు



చేయాలని హైకోర్టులో అప్పీలు చేశారు. ఇటీవల విచారణ పూర్తి చేసిన హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కే లక్ష్మణ్, జస్టిస్ పీ శ్రీసుధతో కూడిన ధర్మాసనం మంగళవారం తీర్పు చెప్పింది. అయితే ప్రధాన నిందితుడు మహమ్మద్ రియాజ్ అలియాస్ రియాజ్ భత్కల్ ఇంకా పరారీలోనే ఉన్నాడు.

## ఉత్తర తెలంగాణకు మరిన్ని మౌలిక సౌకర్యాలు

**జనంవెలుగు, అదిలాబాద్, ఏప్రిల్ 8:–** హైదరాబాద్ నగరం నుండి ఉత్తర తెలంగాణ జిల్లాలకు రవాణా వ్యవస్థను మరింత సులభతరం చేసేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సికింద్రాబాద్ ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట ఔటర్‌రింగ్ రోడ్డు వరకు నిర్మించ తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుకు భూసేకరణ సమస్యలు ఇంకా వీడడం లేదు.ఈ కీలకమైన ప్రాజెక్టు మొదటి దశలో భాగంగా ప్రైవేటు ఆస్తుల సేకరణకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ రక్షణ శాఖ భూముల బదలాయింపు ప్రక్రియలో జరుగుతున్న జాప్యం ప్రాజెక్టు పురోగతికి అడ్డంకిగా మారింది. కేంద్ర ప్రభుత్వం నుండి సూత్రప్రాయంగా ఆమోదం లభించినప్పటికీ భూమిని హెచ్ఎండీఏకు అప్పగించే విషయంలో ఇంకా స్పష్టత రాకపోవడంతో టెండర్ల ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఈ భూసేకరణ ప్రక్రియ పూర్తిగా పూర్తయితేనే టెండర్లు పిలిచేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)కు అవకాశం లభిస్తుంది.ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీఫాం వరకు 5.4 కిలోమీటర్ల పొడవైన ఒక ఎలివేటెడ్ కారిడార్‌తో పాటు, ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట అవుటర్ రింగ్ రోడ్డు ఇంటర్‌ఛేంజ్ వరకు 18.10 కిలోమీటర్ల మేర మరో భారీ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించేందుకు ప్రభుత్వం ఏడాది క్రితమే శంకుస్థాపన చేసింది. శామీర్‌పేట కారిడార్ ప్రాజెక్టు కోసం సుమారు 197 ఎకరాల భూమిని సేకరించాలని అధికారులు ప్రణాళికలు రూపొందించారు. అత్యధికంగా, అంటే 113.48 ఎకరాల భూమి రక్షణ శాఖ నుండి సేకరించాల్సి ఉంది.

2లో

## అనుముల ఇంటెలిజెన్స్ రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తోంది:ఎమ్మెల్సీ కవిత



**జనంవెలుగు, హైదరాబాద్:–** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేసారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో చాలా ప్రమాదముందని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారు. ఏఐ అంటే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాదు. ఏఐ అంటే అనుముల ఇంటెలిజెన్స్. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో కాదు. అనుముల ఇంటెలిజెన్స్ తో రాష్ట్రానికి ప్రమాదం ఉంది. అనుముల ఇంటెలిజెన్స్ రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తోంది. అనుముల ఇంటెలిజెన్స్ పక్కకు జరిగితే తప్పా రాష్ట్రం బాగుపడే పరిస్థితి కనిపించడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సమగ్ర కుటుంబ సర్వే వివరాలు వెబ్ సైట్ లో పెట్టాము. మరి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు ఆ ధైర్యం లేదు ? 2011లో యూపీఏ హయాంలో దేశంలో కులగణన చేసినా ఇప్పటికీ వివరాలు వెల్లడించలేదు తెలంగాణలో చేసిన కులగణన వివరాలను వెల్లడించలేదు. బీసీ కులగణన చేయబోమని బీజేపీ స్పష్టం చేసింది కాబట్టి ఆ పార్టీపై ఒత్తిడి చేయాలి. కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంతో మేము కూడా కలిసి వస్తాం. కానీ కాంగ్రెస్ లాగా ఢిల్లీలో దొంగ దీక్షలు చేయము. అవసరమైతే ఢిల్లీకి వెళ్లి నిరవధికంగా దీక్షలు కూర్చుందాం. చట్టసభలు బిల్లులు ఆమోదించి నాలుగు వారాలైంది. ప్రస్తుతం ఆ బిల్లుల స్థితి ఏమిటో ప్రభుత్వం చెప్పాలి. గవర్నర్ వద్దనే పెండింగ్ లో ఉన్నాయా లేదా రాష్ట్రపతికి పంపించారా ? బిల్లులు ఆమోదం పొందిన తర్వాత అన్ని పార్టీలను ప్రధాని వద్దకు తీసుకెళ్తామని సీఎం అన్నారు. కానీ ఇప్పటి వరకు అఖిలపక్షాన్ని ఢిల్లీకి వెళ్లలేదు. బీజేపీతో సీఎం రేవంత్ రెడ్డికి లాలూచి లేకుంటే ప్రధాని అపాయింట్ మెంట్ లభించేది. బీజేపీని కాపాడడానికి కాంగ్రెస్ పార్టీ ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లడం లేదని అన్నారు.

## కామారెడ్డిలో కల్తీ కల్లు



**జనంవెలుగు, నిజామాబాద్, ఏప్రిల్ 8:–** కామారెడ్డి జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఈ రోజు సాయంత్రం కల్తీ కల్లు తాగి 15 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గమనించిన స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు.వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లాలోని నస్రుల్లాబాద్ మండలంలోని దుర్కి గ్రామంలో ఈ రోజు చాలా మంది కల్లు తాగారు. అయితే అది కల్తీ కల్లు కావడంతో చాలా మంది అనారోగ్యానికి గురయ్యారు. వీరిలో 15 మంది పరిస్థితి సీరియస్ గా ఉండడంతో వెంటనే స్థానికులు నిజామాబాద్ ఆస్పత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. మరి కొంత మంది మతి స్థిమితం కోల్పోయినట్టు ప్రవర్తిస్తున్నారు. బాధిత వ్యక్తుల్లో నలుగురి పరిస్థితి విషయం ఉన్నట్టు వైద్యులు తెలిపారుగ్రామంలో కల్లు తాగిన అందరూ మతిస్థిమితం కోల్పోయి వింతగా ప్రవర్తిస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. వెంటనే గ్రామస్థులు పోలీసులు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఉన్నత అధికారులు గ్రామానికి చేరుకున్నారు. అక్కడి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. దీనిపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

TELTEL/2023/87917
జనంవెలుగు
www.janamvelugu.com, janamvelugu2023@gmail.com
అనునిత్యం అక్షరసత్యం
బుధవారం 9 ఏప్రిల్ 2025



# ఉత్తర తెలంగాణకు మరిన్ని మౌలిక సౌకర్యాలు

రక్షణ శాఖ నుండి తీసుకునే భూమికి సమానమైన విలువ కలిగిన భూమిని మరో ప్రాంతంలో ప్రభుత్వం వారికి కేటాయించవలసి ఉంటుంది. ఇప్పటికే హెచ్ఎండీఏ పలు ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను రక్షణ శాఖకు ప్రతిపాదించింది. ఈ భూమి గుర్తింపు మరియు బదిలీ ప్రక్రియలో జరుగుతున్న ఆలస్యం కారణంగా ప్రాజెక్టు యొక్క మిగిలిన పనులు కూడా నెమ్మదిగా సాగుతున్నాయి. అంతేకాకుండా రక్షణ శాఖకు చెందిన భూముల్లో ఒకచోట 5 లక్షల గ్యాలన్ల సామర్థ్యం కలిగిన తాగునీటి సరఫరా రిజర్వాయర్ మరొక చోట 2.5 లక్షల గ్యాలన్ల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌తో పాటు కొన్ని భవనాలు కూడా ఉన్నాయి. ఈ రిజర్వాయర్‌లకు, భవనాలకు ప్రత్యామ్నాయంగా వేరే చోట స్థలం కేటాయించి అక్కడ కొత్త రిజర్వాయర్‌లు. భవనాలు నిర్మించి రక్షణ శాఖకు అప్పగించవలసి ఉంటుంది. ఈ సంక్లిష్టమైన ప్రక్రియ మొత్తం పూర్తయితేనే రక్షణ శాఖ నుండి ఈ ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో గ్రీన్‌సిగ్నల్ వచ్చే అవకాశం ఉందని ఒక ఉన్నతాధికారి తెలిపారు. ఈ ప్రక్రియకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు నిర్మాణ పనులతో పాటు భూసేకరణ కోసం మొత్తం సుమారు రూ. 3619 కోట్లు ఖర్చు చేయనున్నారు. ప్యారడైజ్ నుంచి డెయిరీఫాం వరకు నిర్మించనున్న 5.4 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ కోసం హెచ్ఎండీఏ ఇప్పటికే టెండర్లను ఆహ్వానించింది. ఈ టెండర్లను ఎలక్ట్రానిక్ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో పిలిచారు. ఈ నెల 15వ తేదీన ఈ టెండర్లను తెరవనున్నారు. మొదట సాంకేతిక అర్హతలు కలిగిన సంస్థల బిడ్‌లను పరిశీలిస్తారు.ఆ తర్వాత అర్హత సాధించిన సంస్థల ధరల బిడ్‌లను తెరుస్తారు. అత్యల్ప ధరకు కోట్ చేసిన సంస్థ ఎల్1గా నిలిచి ఈ ప్రాజెక్టు పనులను దక్కించుకుంటుంది. ఈ కారిడార్ అందుబాటులోకి వస్తే 44వ జాతీయ రహదారిలో మేడ్చల్, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ వైపు వెళ్లే వాహనాల రాకపోకలు ఎంతో సులభతరం కానున్నాయి. ఈ ప్రాజెక్టు కోసం సుమారు రూ. 652 కోట్లు భూసేకరణతో కలిపి మొత్తం రూ. 1550 కోట్లు ఖర్చు చేయనున్నారు.

## ఆర్‌టీసీలో ప్రగతి సాధించిన ఉద్యోగులకు “ప్రగతి చక్రం” పురస్కారాలు

### నిజామాబాద్-1 డిపోలో ఘనంగా అవార్డు ప్రదానం



**జనంవెలుగు, నిజామాబాద్, ఏప్రిల్ 8:** ఆర్‌టీసీ అభివృద్ధిలో తమ పాత్రను చాటుకుంటూ విశేష ప్రగతి సాధించిన 29 మందికి “ప్రగతి చక్రం” పురస్కారాలను రీజినల్ మేనేజర్ టీ.జోస్నా చేతుల మీదుగా నిజామాబాద్-1 డిపోలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ “ఆర్‌టీసీ అభివృద్ధి దశలో ఉందంటే దానికి ప్రతి ఒక్కరు కారణం. భద్రతకు, భరోసాకు మరోపేరు ఆర్‌టీసీ. మనందరం కలిసికట్టుగా కష్టపడి నిజామాబాద్‌ను రాష్ట్రంలోనే ముందంజలో నిలపాలని కోరుకుంటున్నాను” అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎస్. మధుసూదన్, పర్సనల్ ఆఫీసర్, సూపర్‌వైజర్లు, డిపో-1 మేనేజర్ ఆనందకుమార్, డిపో-2 మేనేజర్ సాయన్న, ఉద్యోగులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అవార్డు పొందిన ఉద్యోగులు తమ సేవలను మరింతగా అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ పురస్కారాలు ఉద్యోగుల్లో నూతనోత్సాహం నింపుతూ, సంస్థ అభివృద్ధికి మరింత తోడ్పడతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఓవర్‌లోడ్ నల్లమట్టి టారస్ ల పట్టివేత



**జనంవెలుగు, నందిపేట్:-** తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం వచ్చే వ్యాపారం ఏదైనా ఉందంటే నల్లమట్టి మాఫియా అని చెప్పవచ్చు. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పంచగుడి గోదావరి నది ఒడ్డున నల్లమట్టి తవ్వకాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. నిర్మల్-నిజామాబాద్ సరిహద్దు కావడంతో జిల్లా దాటుతున్న నల్లమట్టిని సంపదను దళారులు స్వేచ్ఛగా దోచుకుంటున్నారు. ప్రతి రోజూ దాదాపు వందల భారీ టారస్ వాహనాల నల్లమట్టి తరలిపోతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రైతులకు, పంట పొలాలకు సహాయపడే ఈ సహజ వనరు దళారుల చేతిలో వ్యాపార వస్తువుగా మారిపోయింది. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పంచగుడి నుండి మచ్చర్ల వైపు ఓవర్‌లోడ్ నల్ల మట్టి తరలిస్తున్న భారీ వాహనాలను నందిపేట్ మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తా వద్ద రెవెన్యూ అధికారులు, పోలీసులు ఆపి పరిశీలించారు. తనిఖీలో భాగంగా మూడు ఓవర్‌లోడ్ భారీ టారస్ లను గుర్తించి, వాటిని నందిపేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు నందిపేట్ డిప్యూటీ తహశీల్దార్ తెలిపారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం అక్రమంగా అధిక మట్టితో లోడ్ చేసిన ఈ వాహనాలు అనుమతి లేకుండా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. “ప్రజల భద్రత, రోడ్డు ప్రమాణాలు దృష్టిలో ఉంచుకుని, ఇటువంటి అక్రమ రవాణాను కఠినంగా ఎదుర్కొంటామని తెలిపారు. ఈ తనిఖీలలో రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తాళ్ళ రాంపూర్ విడిసిపై చర్యలు తీసుకోవాలి

### 15 గౌడ కుటుంబాలను గ్రామ బహిష్కరణ బాధితులకు న్యాయం చేయాలి

### తెలంగాణ రాష్ట్ర బిసి, ఎస్సి, ఎస్టి మైనారిటి సంక్షేమ వేధిక రాష్ట్ర అధ్యక్షుడు శంకర్



**జనం వెలుగు, బాల్కొండ:-** బాల్కొండ నియోజక వర్గంలోని తాళ్ళ రాంపూర్ గ్రామంలో 15 గౌడ కుటుంబాలను బహిష్కరించిన ఆ గ్రామాభివృద్ధి కమిటి (విడిసి) పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని తె లంగాణ రాష్ట్ర బిసి, ఎస్సి, ఎస్టి మై నారిటి సంక్షేమ వేధిక అధ్యక్షుడు బుస్సాపూర్ శంకర్ డిమాండ్ చేశాడు. మండల కేంద్రమైన బాల్కొండ పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆ యన మాట్లాడాడు. గ్రామాలలో విడి సిల ఆగడాలు, అరాచకాలు రోజు, రోజుకు మితి మీరి పోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశాడు. శ్రీ రామ నవమి పర్వదిన సందర్భంగా ఆలయంలో గౌడ కులస్థులు కుంకు మార్చనలో పాల్గొనేందుకు వెళ్ళగా, అన్ని సిద్ధం చేసుకుని వచ్చారని ఆ లయం నుండి బయటకు వెళ్ళాలని విడిసి హుకుంను విడిసి జారి చేసి మరీ బయటకు వెళ్ళిపోయేలా ప్రేరే పించడం సభ్యసమాజం తలదించు కునేలా ఉందని ఆయన అన్నాడు. విడిసి బహిష్కరించిన బాధిత 15 గౌడ కుటుంబాలకు రక్షణ కల్పించి బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశాడు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు సైద్గార్ శ్రీనివాస్ గౌడ్, సిఎచ్ నరేందర్, జిల్లా కార్యదర్శి చింతకింది సంతోష్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నవీన్ చారి, జిల్లా నాయకులు దాసరి రాజేష్, నల్ల మోహన్, అంకార్ గణేష్, నిజామాబాద్ నగర అధ్యక్షుడు చంద్రకాంత్, వడ్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమెన్స్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ వార్షికోత్సవం సందర్భంగా వైద్య శిబిరం

### ప్రముఖ వైద్యుల సేవలతో హెల్త్ క్యాంపు ఘనంగా నిర్వహణ

**జనంవెలుగు, నిజామాబాద్:** నిజామాబాదు జిల్లా ఉమెన్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా, ఏప్రిల్ 8, 2025న రిటైర్డ్ ఎంప్లాయీస్ భవనంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో ప్రముఖ వైద్యులు పాల్గొని వారి సేవలను అందించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి సునీత కుంచాల మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాలలో ముందుంటున్నారు. అలాంటిది జర్నలిజంలో ముందుకు సాగడమే కాకుండా, మహిళల కోసం జర్నలిస్ట్ అసోసియేషన్ స్థాపించి వారి సమస్యల పట్ల పోరాటం చేయడం గొప్ప విషయం అని అన్నారు. నుడా చైర్మన్ కేశ వేణు మాట్లాడుతూ, మగవారికి దీటుగా మహిళలు జర్నలిస్టులుగా పనిచేస్తున్నారని, వారికి ఎల్లప్పుడూ మా సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు.ఎన్నో స్వచ్ఛంద కార్యక్రమాలు ఈ అసోసియేషన్ ద్వారా చేపట్టిన, మహిళ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు బైసా సంగీత కి అలాగే సభ్యులకు అభినందనలు తెలిపారు. జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్న మధ్యతరగతి జర్నలిస్టుల ఆరోగ్యంపై ఇటీవల వెలుగులోకి వచ్చిన ఆందోళనకరమైన ఘటనలు, ఆరోగ్య సమస్యలతో ఎంతో మంది జర్నలిస్టులు మృతిచెందిన వాస్తవాలు ఈ క్యాంపు ఏర్పాటుకు ప్రేరణగా నిలిచాయి. జర్నలిస్టుల ఆరోగ్యంపై అవగాహన పెంచే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రముఖ మహిళా నాయకురాలు నీతూ కిరణ్ మాట్లాడుతూ, మహిళల కోసం ఒక అసోసియేషన్ స్థాపించి పాత్రికేయుల శ్రేయస్సు కోసం పోరాటం చేసి వారి సమస్యలపై




పోరాడడం అనేది గర్వించదగ్గ విషయం అని అన్నారు. వీరి పోరాటం ఎందరో జర్నలిస్టులకు స్ఫూర్తి కావాలని కోరారు. సమాజానికి మంచి చేయాలనే సేవ భావంతో ఎన్నో స్వచ్ఛంద కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అనేది హర్షించదగ్గ విషయమని సంఘ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమం లో కట్ట నర్సింహా న్యూరో సర్జన్, హరి కృష్ణ రెడ్డి కిడ్నీ స్పెషలిస్ట్, శ్రీకాంత్ కార్డియాలజిస్ట్, శ్రీనివాస్ యూరాలజీ, ఆదిత్య ఆర్థో సర్జన్, హితేష్ కుమార్ డయాబెటిస్ స్పెషలిస్ట్, విశ్వనాథ్ జనరల్ ఫిజిషియన్, కృష్ణమూర్తి కంటి నిపుణుడు, లాంటి అత్యంత అనుభవం గల వైద్యులు హాజరై, అధునాతన పరికరాలతో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

## అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయండి

### బిఆర్ఎస్ ఎంఎల్సి కల్వకుంట్ల కవిత




**జనం వెలుగు, ఆర్మూర్:-** మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసేందుకు ఈ నెల 11 వరకు ప్రకటన చేయాలని బిఆర్ఎస్ ఎంఎల్సి కల్వకుంట్ల కవిత ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో పూలే విగ్రహాన్ని ఏర్పాటు మంగళవారం ఆమె దీక్ష నిర్వహించారు. తెలంగాణా కాంగ్రెసు ప్రభుత్వం చేపట్టిన బిసిల కుల గణన వివరాలను వెల్లడించలేదని, ఇకపోతే బీసి కుల గణను చేయ బోమని బిజెపి స్పష్టం చేసిందని బిజెపిపై కాంగ్రెసు ప్రభుత్వం ఒత్తిడి చేయాలని ఆమె డిమాండ్ చేశారు. యుపిఏ హయాంలో 2011 లో దేశంలో కుల గణను చేసినప్పటికీ ఆ వివరాలను ఇప్పటి వరకు ఇంకా వెల్లడించలేదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెసు పార్టీ లాగా డిల్లీలో దొంగ దీక్షలు చేయమని, అవసరమైతే డిల్లీకి వెళ్ళి బిసిల కోసం నిరవధికంగా దీక్షలు చేపడ దామని ఆమె తెలిపారు. చట్ట సభ లలో బిసి బిల్లును ఆమోదించి నెల రోజులు అవుతున్నా ప్రస్తుతం ఆ బిల్లు పరిస్థితి ఏమిటో తేల్చి చెప్పా లని ఆమె అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని కాపాడేందుకే అఖిల పక్షాన్ని కాంగ్రెసు సిఎం రేవంత్ డిల్లీకి తీసుకెళ్ళడం లేదని ఆమె అన్నారు. డిల్లీలో బిసిలు నిర్వహించిన ధర్నాలో తెలంగాణ సిఎం రేవంత్ తెలుగు భాషలో మాట్లాడితే డిల్లీ పెద్దలకు ఎలా అర్థం అవుతోందని డిల్లీ పెద్దలకు అర్థమయ్యే భాషలో మాట్లాడాలని ఆమె తెలిపారు. కాంగ్రెసు ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బిసిల కుల గణన నివేదికను అసెంబ్లీలో ప్రవేశ పెట్టాలని ఆమె డిమాండ్ చేశారు.